క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న సిబ్బంది

లోకేశ్వరం: ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో మండలంలోని రాజూర ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయితేజ, అమన్, నర్మిమన్ అయేషా ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను వీడీసీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం రాజేశ్వర్, కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్త గౌడ్, పోషకుల కమిటీ చైర్మన్ సాయిప్రసాద్, వైస్ చైర్మన్ ముజాహిద్, వీడీసీ చైర్మన్ ప్రవీణ్, కలీం, భోజన్న పాల్గొన్నారు.

సివిల్స్‌పై అవగాహన

కడెం: మండలంలోని అల్లంపల్లి జీయర్ గురుకులాన్ని శుక్రవారం ఐఏఎస్ బాలలత సీఎస్‌బీ ఐ ఏఎస్ అకాడమీ బృంద సభ్యులు సందర్శించారు. ఈసందర్భంగా గురుకులం విద్యార్థులకు సివిల్స్‌పై అవగాహన కల్పించారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వారానికోసారి ఉచిత ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శాంతారాం స్వామిజీ, అధ్యాపక బృందం తదితరులున్నారు.

‘ఉపాధి’ గ్రామసభ

తానూరు: మండలంలోని మొగ్లిలో శుక్రవారం 2025–26లో చేపట్టే ఉపాధి పనుల గుర్తింపు, ప్రణాళిక తయారీపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్ మాట్లాడుతూ పొలాలకు వెళ్లే రోడ్ల ఏర్పాటుతోపాటు చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకుంటే అర్హులకు జాబ్‌కార్డులు అందించి.. పనులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏ ప్రసాద్, కార్యదర్శి రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లోదుస్తులు, చెప్పులు, బూట్లు పంపిణీ చేశారు. డీటీడీవో జాదవ్ అంబాజీ ఆదేశాల మేరకు పాఠశాలలోని 246 మంది విద్యార్థులకు వీటిని అందించినట్లు హెచ్‌ఎం గఫార్, వార్డెన్ ఆడె బలిరాం తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

రచయితకు చేయూత

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి (కే)గ్రామానికి చెందిన సింథె శ్రీకాంత్ తల్లి అనురాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శ్రీకాంత్ అమ్మ జ్ఞాపకార్థం ‘అనుశ్రీ ’పుస్తకం రాశాడు. ఈపుస్తకం అమ్మ గొప్పత నం చాటుతుందని సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ పేర్కొన్నారు. సమత ఫౌండేషన్ తరఫున శుక్రవారం నర్సాపూర్(జి) అంబేద్కర్ భవన్‌లో శ్రీకాంత్‌కు రూ.5వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు సాహెబ్‌రావు, సీఈఓ అనిల్, పీఆర్‌ఓ క్రాంతికుమార్, శేఖర్, సాయికృష్ణ, అశోక్, రఘు, దినేశ్, నారాయణ, యోగేశ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

‘కిష్టయ్య త్యాగాన్ని గుర్తించాలి’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: ప్రత్యేక రాష్ట్ర సాధనకు చేపట్టిన మలిదశ ఉద్యమంలో అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించాలని ముదిరాజ్ సంఘం సభ్యులు అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని టీఎన్జీవోస్ సంఘ భవనంలో ముదిరాజ్ సభ్యులు వచ్చే నెల 1న హైదరాబాద్‌లో నిర్వహించే 15వ వర్ధంతి సంస్మరణ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఏదైనా యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు గంగాధర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ

నిర్మల్‌ఖిల్లా: చలి విజృంభిస్తుండటంతో జిల్లా కేంద్రంలోని డవ్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం శుభసంకల్పం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉన్నిరగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు విశ్రాంత తహసీల్దార్ భీమ్‌రావు, గాడిచర్ల అక్షయ్‌శర్మ, గుడి అభినవశర్మ, రాజేశ్, గణేశ్, రాజు తదితరులు న్నారు.

ఉపాధ్యాయులే విద్యార్థులను తీర్చిదిద్దాలి

సోన్: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసి.. వారిని తీర్చిదిద్దాల్సి బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవో పరమేశ్వర్ అ న్నా రు. శుక్రవారం మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బాలసభలో మాట్లాడారు. విద్యార్థులకు నైతిక విలువలూ నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు రాజులదేవి రమేశ్‌బాబు, విజయవాణి, జ్యోతి, రాధ, శైలజ ఉన్నారు.

తూకం వేస్తలేరు..

- కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు
- బాసరలో రైతులకు తప్పని పడిగాపులు
- పట్టించుకోని నిర్వాహకులు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం

బాసర: మండలంలో వరికోతలు నెలరోజుల కిందటే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు 20 రోజుల కిందటే ధాన్యం తీసుకొచ్చి ఆరబెట్టారు. కానీ నిర్ణీత తేమశాతం వచ్చిన ధాన్యం కొనడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు ధాన్యం కుప్పల వద్దే కాపలా ఉంటున్నారు. మరోవైపు కొందరి ధాన్యం తూకం వేసినా.. లారీలు రావడం లేదనే కారణంతో బస్తాలను మిల్లులకు తరలించడం లేదు. అడిగితే.. నిర్వాహకులు తమను పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించా లని రైతులు వేడుకుంటున్నారు.

మండలంలో..

బాసర మండలంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాసర, కిర్గుల్(బి), కిర్గుల్(కె) గ్రామాల్లో ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేశారు.

- కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు భూస్వాములకే ప్రాధాన్యమిస్తూ నిర్ణీత తేమశాతం వచ్చినా తమ పంటను కొనడం లేదని సన్నకారు రైతులు వాపోతున్నారు.
- తూకం వేసినప్పటికీ కొందరు రైతుల ధాన్యం సంచులను మిల్లులకు తరలించకుండా కేంద్రంలోనే ఉంచుతున్నారు.
- లారీలు రావడం లేదని.. వచ్చేవరకు ఈ బస్తాల బాధ్యత మీదేనని నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే రోజుల తరబడి కాపలా ఉంటున్నారు.
- బస్తాలో 40.5 కిలోల ధాన్యం తూకం వేయాల్సి ఉండగా.. హమాలీలు 42 కిలోలు తూకం వేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

42 కిలోలు తూకం వేస్తున్నారు..

ఇటీవల రైతులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సన్నకారు రైతుల ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. ఒక్కో సంచికి 40.5 కిలోలకు బదులు 42 కిలోల ధాన్యం తూకం వేస్తున్నారు. అదనంగా కిలోన్నర ఎక్కువ జోకుతూ తమను దోపిడీ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. 15 రోజుల కిందట పంట అమ్ముకున్నా.. తమ బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమకాలేదని పలువురు పేర్కొంటున్నారు.

కిలోన్నర అదనంగా తూకం వేశారు



20 రోజుల కిందట పంటను తీసుకొస్తే ఇటీవల తూకం వేశారు. 90 బస్తాలయ్యాయి. హమాలీలు నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు అదనంగా కిలోన్నర తూకం వేశారు. నిర్వాహకులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. అధికారులే తమ సమస్య పరిష్కరించాలి. – శేఖర్, బాసర

ఇబ్బంది పడుతున్నాం



పంటను 20 రోజుల కిందట కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. మూడు రోజుల కిందట ధాన్యం తూకం వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క సంచిలో 42 కిలోల ధాన్యం తూకం వేశారు. రైతులం ఇబ్బంది పడుతున్నాం. – సాయిరెడ్డి, బాసర

పాఠశాలల్లో ఆహార భద్రత కమిటీ తప్పనిసరి

ముధోల్: పాఠశాలల్లో ఆహార భద్రత కమిటీని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎంఈవో రమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వంటగదులు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. వంట చేసే ముందు కూరగాయలు, సరుకుల నాణ్యత పరిశీలించాలని సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి, సీపీవో జీవరత్నం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని హెచ్‌ఎంలు, వార్డెన్లు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వంటగదిని నిత్యం పరిశీలిస్తూ.. భోజనం సిబ్బంది తిన్నత ర్వాతే విద్యార్థులకు అందించాలని సూచించారు. తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీత, ఎంఈవో ప్రేమ్‌సాగర్ తదితరులు ఉన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



కుభీర్ పీఏసీఎస్‌లో వేడుకలు

కుంటాల: రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, సన్నరకం వడ్లకు బోనస్ అందిస్తూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం అన్నారు. శుక్రవారం మన పండుగ–రైతు పండగ వేడుకలను కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీఈవో నాగభూషణం, డైరెక్టర్ ప్రణయ్‌రావు, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భోజేందర్, మహేశ్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం రైతుపండుగ నిర్వహించారు. సీఈవో క్రాంతికుమార్, కార్యాలయ సిబ్బంది శివరాం, గణేశ్, వెంకట్రాములు, ఉదయ్, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో శుక్రవారం రైతుపండుగ వేడుకలు నిర్వహించారు. సొసైటీ చైర్మన్ రామడుగు శైలజరమేశ్‌రావు మాట్లాడారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, భూషణ్, రమేశ్, సీఈవో రాజేందర్, సిబ్బంది తదితరులున్నారు.

ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లు పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ శివారులో ఉన్న సుద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లను శుక్రవారం అధికారులు పట్టుకున్నారు. మైనింగ్‌శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఆర్‌ఐ బాలకిషన్, మండల పోలీసులు కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న భైంసా, లోకేశ్వరం మండల కేంద్రాలకు చెందిన 11 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5050 చొప్పున జరిమానా విధించినట్లు రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి



ప్రవచనాలు చేస్తున్న మహరాజ్



హాజరైన భక్తులు

భైంసారూరల్: ప్రతిఒక్కరూ సాటివారితో దయతో ఉంటూ సన్మార్గంలో పయనించాలని పలువురు మహారాజ్‌లు పేర్కొన్నారు. మండలంలోని చుచుంద్ గ్రామ సిద్ధేశ్వరాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శుక్రవారం ముగిసింది. మహారాజ్‌లు మాట్లాడారు. ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఈసందర్భంగా పలువు రు తులసీమాలలు ధరించారు. అనంతరం ఉట్టి కొట్టి భక్తులకు ప్రసాదం అందజేశారు. సప్తాహంలో పాల్గొన్న మహారాజ్‌ను వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఏటా మాదిరి ఈసారి కూ డా జాతర నిర్వహించగా భక్తులు తరలివచ్చారు. అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేశారు.

మంచి భోజనం అందించాలి

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో ముత్యం సూచించారు. శుక్రవారం కుంటాల ఆదర్శ పాఠశాలలోని మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళి, ఉపాధ్యాయులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని బిలోలి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో చంద్రకాంత్ పరిశీలించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం, పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. వారి ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణ ఉన్నారు.



కుంటాల : వంట పరిశీలిస్తున్న ఎంఈవో ముత్యం

తానూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో నరేందర్ సూచించారు. శుక్రవారం తానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. పరిశుభ్రమైన పరిసరాల్లో వంట చేయించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మల్లన్న, సాయిబాబు తదితరులు ఉన్నారు.

‘1న సింహగర్జన సభకు తరలిరావాలి’

భైంసాటౌన్: వచ్చే నెల 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభకు నియోజకవర్గం నుంచి తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తాలూక అధ్యక్షుడు శంకర్‌చంద్రే పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం వద్ద సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దేవిదాస్, గంగాధర్, దిగంబర్, లక్ష్మణ్, శ్రీరాములు, గౌరవాధ్యక్షులు గంగాధర్ జాడే, ప్రసంజిత్ ఆగ్రే, గిరిధర్ జంగ్మే, గౌతం పింగ్లే, తదితరులున్నారు.

లోకేశ్వరం: మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు శంకర్ చెంద్రే అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సింహగర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు గంగాధర్ జాడే, గిరిధర్ జంగ్మే, రాజారాం, మండలాధ్యక్షుడు ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు రమేశ్, మండల కమిటీ సభ్యులు రాజు, ఎర్రన్న, మధుకర్, శ్రీనివాస్, శంకర్, యూత్ సభ్యులు ఉన్నారు.

‘రెగ్యులరైజ్ చేయాలి’

ముధోల్: సీఎం ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శుక్రవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు ముధోల్‌లోని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ వరంగల్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 100రోజుల్లో రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



భైంసారూరల్ : ధర్నా చేస్తున్న ఉద్యోగులు

భైంసారూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పేస్కేల్ అమలు చేసి నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని కోరారు. 12నెలల వేతనం, బీమా, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు.

బాసరకు చేరిన పాదయాత్ర



గంగాహారతి ఇస్తున్న మహరాజ్, భక్తులు

బాసర: నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం శనీశ్వర సహిత స్వయంభు శివాలయం లింగం గుట్ట వ్యవస్థాపకులు శ్రీరాజయోగి సిద్ధేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులు బాసర వరకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. 108 మంది ముత్తైదువులతో మహరాజ్ ఆధ్వర్యంలో గోదారమ్మకు అభిషేకం, అర్చన, గంగాహారతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం సరస్వతీ, మహాలక్ష్మీ, మహాకాళీ అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు జిడ్డు సుభాష్‌యాదవ్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల భక్తులు పాల్గొన్నారు.

మండలస్థాయి ‘గణిత’ పోటీలు



కడెం: విద్యార్థులతో ఉపాధ్యాయులు



సోన్‌లో ప్రశ్నపత్రాలు చూపుతున్న ఉపాధ్యాయులు



తానూరులో విద్యార్థులతో ఉపాధ్యాయులు

భైంసాటౌన్: జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ఏపీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ఎంఈవో సుభాశ్ హాజరై ప్రారంభించారు. తిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన యు.నితీశ్ ప్రథమ స్థానంలో, భైంసా జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.సరిత ద్వితీయ స్థానంలో, వానల్‌పాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన వై.శివాణి తృతీయ స్థానంలో నిలిచినట్లు ఏపీనగర్ పాఠశాల హెచ్‌ఎం అడెల్లు తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో పి.శ్వేత(టీజీడబ్ల్యూఆర్‌ఎస్,భైంసా) ప్రథమ, ఎ.హరిప్రియ(జెడ్పీహెచ్‌ఎస్, మాటేగాం) ద్వితీయ, ఎన్.దుర్గ(టీజీడబ్ల్యూఆర్‌ఎస్, భైంసా) తృతీయస్థానంలో నిలిచారు. వీరు డిసెంబర్ 11న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శేఖర్‌వర్మ, గోపాల్‌రెడ్డి, రమేశ్, ప్రసాద్, స్వప్న, హిమబిందు, లావణ్య ఉన్నారు.

కడెం: గణిత ప్రతిభా పాటవ పరీక్షలో మండలంలోని లింగాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మండలస్థాయి పోటీల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రథమస్థానంలో అబ్దుల్ జుల్ఫీ, ద్వితీయ స్థానంలో నివేదిత.. తెలుగు మాధ్యమంలో సతీశ్, ద్వితీయ స్థానంలో రాజు నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

తానూరు: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం తానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గణితశాస్త్రంపై విద్యార్థులకు మండలస్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ఆయా పాఠశాలల పదోతరగతి విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియంలో కె.రజిత (ఎల్వి పాఠశాల) ప్రథమ, సీహెచ్.శివరాజ్(బో రిగాం పాఠశాల) ద్వితీయ, ఎస్.అఖిల(ఎల్వి పాఠశాల) తృతీయస్థానంలో నిలిచారు. వీరు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. ఎంఈవో నరేందర్, గణిత ఉపాధ్యాయులు ఆవుల గంగాధర్, రవీందర్, శ్రీనివాస్, రవికిరణ్ ఉన్నారు.

నిర్మల్‌రూరల్: మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిద్ధపద్మ పరీక్ష పత్రాలు విడుదల చేశారు. గణిత ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.శ్రీనివాస్, మనోహర్ ఉపాధ్యాయులు ఉన్నారు.

సోన్: గణిత ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని పదోతరగతి విద్యార్థులకు సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ప్రతిభా పాటవ పోటీలు(టీఎంఎఫ్) నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన తెలిపారు. తెలుగు మాధ్యమంలో జాఫ్రాపూర్, పాక్‌పట్ల పాఠశాలల విద్యార్థులు శ్వేత ప్రథమ, వైష్ణవి, ప్రశాంత్, ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆంగ్ల మాధ్యమంలో సోన్ పాఠశాల విద్యార్థులు రిషిత ప్రథమ, సాయికృష్ణ ద్వితీయ, న్యూవెల్మల్ బొప్పారం పాఠశాల విద్యార్థి మాధురి తృతీయ స్థానంలో నిలిచారు. వీరు జిల్లా స్థాయిలో పాల్గొననున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిధుల మంజూరుకు వినతి

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో సీఎస్ఐ వెస్లీ చర్చి టవర్, భీమన్న ఆలయ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం నిర్మల్‌లోని తన కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు లక్ష్మణచాంద ప్రజలు వినతిపత్రం అందచేశారు. నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, మండలాధ్యక్షుడు రాజేశ్వర్, సిరిపురం నాగేశ్, సుంకరి సురేశ్, రాజ్‌కిరణ్ తదితరులున్నారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’

నర్సాపూర్(జి): ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ విమర్శించారు. మండలంలోని రాంపూర్‌లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. రాష్ట్ర సర్కారు వైఫల్యాలకు నిరసనగా బీజేపీ వచ్చే నెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రా జు, జిల్లా కార్యదర్శులు మిట్టపల్లి రాజేందర్, కొరిపల్లి శ్రావణ్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, మండలాధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, రచ్చ మల్లేశ్, శ్రీకాంత్ రెడ్డి, వినోద్‌రెడ్డి, గంగాధర్, హన్మాండ్లు, అరుణ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై వ్యాసరచన పోటీలు

ఖానాపూర్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మస్కాపూర్ కేజీబీవీలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పో టీలను నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్ సూచన మేరకు ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై వ్యాసరచన పోటీలు చేపట్టారు. ఈ సందర్భంగా టీబీ, ఎయిడ్స్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సునీతరాణి, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

వంటల పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఏఎన్ రెడ్డి కాలనీ క్లబ్ హౌస్‌లో శుక్రవారం ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంటల పోటీలను నిర్వహించారు. పట్టణ మహిళలు పాల్గొని వివిధ రకాల తెలంగాణ వంటకాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. డీఎస్‌ఓ కిరణ్ వంటకాలను పరిశీలించి.. వంటింట్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, సీటీఓ గోదావరి, డీలర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

నిర్మల్‌ఖిల్లా: కార్తికమాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి రథాలగుడిలో ఉన్న అన్నపూర్ణ విశాలాక్షి సహిత విశ్వేశ్వర ఆలయంలో పంచాంగకర్త, అర్చకులు గాడిచెర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి రుద్రాభిషేకం, పుష్పాలంకరణ, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మాల్ ప్రాక్టీస్

భైంసాటౌన్: పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేయూ రెగ్యులర్ పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం పరీక్షలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య తెలిపారు. ఈమేరకు వారిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలి

భైంసాటౌన్: ఆస్పత్రుల యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని భైంసా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలు, నివారణ, తదితర అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రమేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో డీసీఎంఎస్ ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఏవో రాంచందర్‌నాయక్ పరిశీలించారు. ఈసందర్భంగా సన్న రకం ధాన్యాన్ని డిజిటల్ మీటర్(గ్రెయిన్ క్యాలిపర్)లో పరిశీలించారు. కొనుగోలు వేగవంతం చేసి ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో గణేశ్, నిర్వాహకుడు గోస్కుల భూమయ్య, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా విఠలేశ్వరుని జాతర



శోభాయాత్రలో ప్రజలు

కుభీర్: మండలకేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం జాతర ఘనంగా నిర్వహించారు. ఏడురోజులుగా జరుగుతు న్న తాళసప్తాహం ముగిసింది. జా తరకు స్థానిక ప్రాంతాలు, మహా రాష్ట్రలోని పలు గ్రామాల ప్రజలు, భజన మండళ్ల సభ్యులు వచ్చి భజనలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటలకు కాకడ హారతి నిర్వహించగా.. తొమ్మిది గంటలకు విఠల రుక్మాబాయి ప్రతిమలను రథంలో ఉంచి శోభాయాత్ర తీశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బంది రాకుండా పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.